క్లుప్తంగా

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల కమిటీ ఏర్పాటు



ఎంపికైన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా కౌసర్ బేగం, సహాయ కార్యదర్శిగా అంబిక, కోశాధికారిగా నందకుమార్, జిల్లా కమిటీ సభ్యులుగా సిగ్బతుల్లా, రవి మనోజ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా హనుమంత రాయప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత హెచ్ఎం ప్రభాకర్ వ్యవహరించారు. రొళ్ల మండల ప్రజా పరిషత్ ఏఓ ప్రసాద్ ఈ ఎన్నికలను పర్యవేక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. రొళ్ల ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఆర్ వీవీజీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ నాయకులు

హిందూపురం: ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోషియేషన్ ఎన్నికలు శనివారం హిందూపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా పరిశీలకుడు ఎల్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో యూనిట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందూపూరం యూనిట్ ప్రెసిడెంట్‌గా హెచ్.రియాజ్ (హిందూపురం), వైస్ ప్రెసిడెంట్ కె.గోవిందరాజు (పరిగి), జనరల్ సెక్రటరీగా ఎం.ఎస్.అమృతరావు (చౌలూరు), జాయింట్ సెక్రటరీగా ఎం.కుళ్లాయప్ప (లేపాక్షి), కోశాధికారి కె.విద్యావతి (సంతేబీదనూరు), జిల్లా కౌన్సిలర్లుగా ఎం.బాబు (ముదిరెడ్డిపల్లి), వైబి నాగఫణి (లేపాక్షి' ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హిందూపురం తాలూకా యూనిట్ ఐదు మండలాల పంచాయతీరాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు నిడుగల్ దుర్గం ఉత్సవాలు



నిడుగల్ దుర్గం

పావగడ: దక్షిణ భారతదేశంలో పవిత్ర పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా పేరు పొందిన నిడుగల్ దుర్గం ఉత్సవాలు ఈనెల 18న ఘనంగా జరగనున్నాయి. రాజ మహారాజులు వాల్మీకి పాళేగాళ్ల పరిపాలన కాలం నుంచి నిర్వహిస్తున్న నిడుగల్ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక మహర్షి వాల్మీకి ఆశ్రమం, నిడుగల్ దుర్గం అభిమానుల ఆధ్వర్యంలో జరుగనున్న ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని వాల్మీకి ఆశ్రమాధిపతి సంజయ కుమార స్వామిజీ శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నిడుగల్ దుర్గంలోని వివిధ దేవాలయాలల్లో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహిళలు, యువతులు రామతీర్థ కళ్యాణిలో గంగ పూజలు నిర్వహిస్తే కళ్యాణ యోగం, సంతాన ప్రాప్తి లభిస్తుందని ప్రతీతి.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో సతీష్‌కుమార్ అనే యువకుడు పురుగు మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది, గ్రామానికి సమీపంలోని పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతన్ని వెంటనే పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లైన్‌మెన్‌కు తప్పిన ప్రమాదం



విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ లైన్‌మెన్ వలీకి త్రుటిలో ప్రమాదం తప్పింది. శనివారం హౌసింగ్ కాలనీ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ నూతనంగా విద్యుత్ లైన్ లాగుతున్నారు. సచివాలయం సమీపంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తుండగా, ప్రమాదవశాత్తూ విరిగి పడింది. స్తంభం పడుతున్న విషయం గమనించిన ఆయన.. పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పిందని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



హిందూపురం: వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవ దృశ్యం



మడకశిర మండలం నీలకంఠాపురంలో ఉట్టి కొడుతున్న చిన్నారి



పెనుకొండ: శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న యాదవులు, పట్టణవాసులు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- హిందూపురంలో ఘనంగా రథోత్సవం

హిందూపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం హిందూపురంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చిన్నమార్కెట్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం మూలవిరాట్ రుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు మేళతాళాలతో ప్రాకారోత్సవం చేశారు. అలాగే ఆలయ ఆవరణలో కల్యాణోత్సవం నిర్వహించారు. మెయిన్ బజారులో పేట వెంకటరమణస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను శ్రీకృష్ణుడి రూపంలో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, ప్రాకారోత్సవం చేపట్టారు. అలాగే బెంగళూరురోడ్డులోని హయగ్రీవ ఆలయంలో మూలవిరాట్ హేమగ్రీవస్వామికి విశేష పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చారు. సత్యనారాయణపేటలోని శేషాసాయిబాబా మందిరంలో శ్రీకృష్ణుడి ప్రతిమను అలంకరించి ప్రత్యేక పూజలు నిచేశారు. నానెప్పనగర్‌లోని సాయిబాబా ఆలయంలో విశేష పూజలు జరిగాయి. పేట వేంకటరమణస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను కృష్ణుడిగా అలంకరించి పూజలు చేశారు.

కన్నుల పండువగా రథోత్సవం

కృష్ణాష్టమిను పురస్కరించుకుని చిన్నమార్కెట్‌లోని రుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పూజలు చేసి గోవిందా గోవిందా అంటూ చిన్నమార్కెట్ నుంచి గణపతి ఆలయం వరకు రథాన్ని లాగి తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్, ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు రాము, ఈఓ నరసింహరాజు, పట్టణ ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ముద్దిరెడ్డిపల్లి భాగ్యనగర్‌లో ప్రబోధసేవా సమితి త్రైత్రసిద్ధాంత నిర్వహకుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహన్ని కొలువుదీర్చి విశేష ప్రత్యేక పూజలు చేసి నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. 19వ తేదీ పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహిస్తామని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షులు ఆదినారాయణ, కమిటీ సభ్యులు తెలిపారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

బెంగళూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో హిందూపురంలోని బెంగళూరురోడ్డు సూగురు ఆంజనేయస్వామి ఆలయం ఆవరణంలో పెద్ద ఎత్తున శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సూగురు ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసి ఇస్కాన్ వేదిక మండపంలో రాధాకృష్ణుడి ప్రతిమలతో చిన్ని శ్రీకృష్ణుడి విగ్రహం కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి దాకా పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో హిందూపురం ఇస్కాన్ హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు భక్తవృందదాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని తులసీధామ వృద్ధాశ్రమం, నీలకంఠాపురం గ్రామాల్లోని వేణుగోపాల స్వామి ఆలయాల్లో శనివారం భక్తుల కోలాహలం మధ్య శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వేణుగోపాల స్వామి, శ్రీ కృష్ణుడి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపు చేపట్టారు. చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టి కొట్టే పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టేందుకు చిన్నారులు ఉత్సాహం చూపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేణుగోపాల స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. షిరిడీ సాయిబాబా ఆలయంలో కృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా కొలువుదీర్చారు. భక్తులను ఆకట్టుకునేలా అలంకరించి పూజలు జరిపారు.

కృష్ణుడి విగ్రహం ఊరేగింపు

అమరాపురం: తమ్మడేపల్లి, వలస, హాలుకూరు, నిద్రగట్ట అమరాపురం గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమరాపురంలోని దక్షిణ గొల్లహట్టిలో వెలసిన కృష్ణాలయంలో శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపుగా స్థానిక చెరువు వద్దకు తీసుకెళ్లి గంగాజలంతో శుద్ధి చేశారు. అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

పావగడ: స్థానిక తాలూకా కార్యాలయంలో శనివారం తహసీల్దార్ వరదరాజు ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక యాదవ సంఘం నాయకులు ముగదాళబెట్ట నరసింహయ్య, మైలార రెడ్డి, ఆర్‌వి రాజగోపాల్, అంజన్ కుమార్, జిటి గిరీశ్, బలరామరెడ్డి, పూజారప్ప, తేజ్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యం గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున శ్రీదేవి, గోదాదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామి మూల విగ్రహాలను అభిషేకించారు. అనంతరం పంచలోహ, వెండి కవచాలతో పాటు బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాదం అందజేశారు. అదేవిధంగా రొళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీరామ భక్తి మండలి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుపుకున్నారు. శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. కోలాటం, ఆటపాటతో చిన్నారి చిలిపికృష్ణులు ఆకట్టుకున్నారు. అర్చకులు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ శ్రీకష్ణుడి విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

రథంపై ఊరేగింపు

పెనుకొండ: పట్టణంలో శనివారం కోట లోపల ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా యాదవులు శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారిని రథంపై ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక ఆకర్షణతో కనిపించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం అలరించింది. ప్రముఖ కళాకారులు కోగిర జయచంద్ర, మరో కళాకారుడు ప్రసాద్‌లు కృష్ణుడు, బలరాముని వేషధారణతో అలరించారు. కేశవయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఈశ్వరయ్య, రాంప్రసాద్‌యాదవ్, బుట్టే రామాంజినేయులు యాదవ్, శ్రీరాంయాదవ్, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురంలో శనివారం సాయంత్రం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. యాదవులు ఆలయంలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీరాంయాదవ్, నరసింహారెడ్డి, హనుమంతు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు



పావగడ: పూజల్లో పాల్గొన్న భక్తులు



పెనుకొండ: శ్రీకృష్ణ బలరాముని వేషధారణలో కోగిర జయచంద్ర, ప్రసాద్



అమరాపురం: జలధి పూజ చేస్తున్న భక్తులు



పెనుకొండ నగర పంచాయితీ ఇస్లాపురంలో ఊరేగింపు నిర్వహిస్తున్న యాదవులు



హిందూపురంలోని సూగురు వద్ద ఇస్కాన్ వేదిక మండపంలో కొలువైన శ్రీకృష్ణుడు



మడకశిర మండలం తులసీధామ వృద్ధాశ్రమంలో వేణుగోపాల స్వామి ఊరేగింపు



రొళ్ల: కొత్తపాళ్యంలో వేంకటేశ్వస్వామికి పూజలు



మడరశిరలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

శాకంబరి అలంకరణలో శనీశ్వరుడు



లేపాక్షిలో ఆంజనేయస్వామికి జ్యోతులు మోస్తున్న ప్రజలు



పెనుకొండలో సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పూజలందుకున్న శనీశ్వరుడు



అలంకరణలో ఆంజనేయస్వామి

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లి గ్రామంలో వెలసిన శనీశ్వర స్వామి శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా మండలంలోని వివిధ శనీశ్వర స్వామి ఆలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బసవనపల్లిలో అర్చకుడు భోజరాజు భక్తులు ఓదప్ప కుటుంబ సభ్యులు తెచ్చిన వివిధ కూరగాయలతో స్వామిని అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన బాగ్యం కల్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో బసవనపల్లి ఆరోనపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరించి పూజలు నిర్వహించారు. పెనుకొండ కొండ కింది భాగంలో ఉన్న సంజీరాయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఊరువాకిలి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

లేపాక్షి: శ్రావణమాసాన్ని పురష్కరించుకుని మండలంలోని వివిధ వైష్ణవ దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి, నరసింహస్వామి, వెంకటేశ్వరస్వామి, రఘునాథస్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా లేపాక్షి కట్టమీద ఆంజనేస్వామికి భక్తులు జ్యోతులు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగాలు, అన్నదానం చేశారు.

పెనుకొండ రూరల్: శ్రావణమాసం శనివారం పూజలను పెద్ద చెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించారు. భక్తులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ అర్చన, అభిషేకాలుతో ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

హామీలు నెరవేర్చకుండా బాబు మోసం



శిరివరంలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న హిందూపురం సమన్వయకర్త దీపిక

లేపాక్షి: ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక హామీలను నెరవేర్చకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని, దీంతో చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని హిందూపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టి.ఎన్. దీపిక అన్నారు. శనివారం మండలంలోని శిరివరం, మైదుగోళం గ్రామాల్లో మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్ అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తి కావాస్తున్నా ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని, హామీలన్నీ అరకొరగా నెరవేరుస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చారని గుర్తుచేశారు. చంద్రబాబు మోసాలు, అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అబద్ధపు హామీలను ప్రజల్లోకి తీసికెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. అలాగే బాబు గ్యేరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బషీర్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, రామాంజి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్, గంగాధర్, రవి, జబీ, మూర్తి, నాగరాజు, రామ్మూర్తి, సైపుల్లా, భాసా, ముసా. గోవింద, రమేష్, వెంకటేశ్, ఫక్రుద్దీన్, అంజినప్ప, రామాంజి, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'

మడకశిరరూరల్: మండల పరిధిలోని వైబీహళ్ళి పంచాయతీ కేంద్రంలో ఆదివారం ఉదయం 11 గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అతిథిగా హాజరవుతారన్నారు. రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

'బస్సు ప్రయాణానికి ఆంక్షలు పెడతారా?'



ఈరలక్కప్ప

మడకశిర: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులో స్త్రీశక్తి పథకం అమలు కావడం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బస్సు ప్రయాణానికి ఆంక్షలు పెడతారా? అని ప్రశ్నించారు. మడకశిర నుంచి శిర, చిత్రదుర్గ తదితర కర్ణాటక ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో స్త్రీశక్తి పథకం వర్తించకపోవడంతో మహిళలు డబ్బులిచ్చి ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. ప్రధానంగా అగళి, రొళ్ల, గుడిబండ మండలాల మహిళలకు ఈ పథకం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే అధికారంలోకి రాగానే ఈ పథకంలో కోత విధించి మహిళలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. అంతర్‌రాష్ట్ర బస్సుల్లో ఉచిత ప్రయా ణాన్ని అనుమతించాలన్నారు. లేకపోతే మహిళలు ఎదురు తిరగడం ఖాయమని హెచ్చరించారు.

దొడగట్ట ప్రభుత్వ పాఠశాలకు మైక్ వితరణ

రొద్దం: మండల పరిధిలోని దొడగట్ట ప్రాథమిక పాఠశాలకు రొద్దం హోటల్ నారాయణప్ప కుమారుడు మంజునాథ్ దంపతులు రూ. 25 విలువజేసే మైక్ సెట్ శనివారం వితరణ చేసినట్లు ఉపాధ్యాయుడు తేజ తెలిపారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు నారాయణస్వామి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన అంజినప్ప, మంజులమ్మ శనివారం కుర్చీలు వితరణ చేశారు.

ఆంజనేయుడికి జ్యోతుల ఊరేగింపు



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ఎస్ గుండ్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శ్రావణ శనివారం సందర్భంగా జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలు, వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆంజనేయుడి విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి జ్యోతులను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహాన్ని వివిధ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించండి



విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి

హిందూపురం టౌన్: విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఎం డాక్టర్ మంజువాణి సూచించారు. పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మలుగూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను ఆమె శనివారం పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీపీ యూనిట్‌లో హిందూపురం డివిజన్ వైద్యాధికారులతో సమావేశమయ్యారు. వైద్యాధికారులు పాఠశాలలను, హాస్టళ్లను సకాలంలో తనిఖీలు చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో పాఠశాలల్లో, పరిసర ప్రాంతాల్లో ఉత్పన్నమయ్యే సీజనల్ వ్యాధులపై సమగ్ర పర్యవేక్షణ ఉండాలన్నారు. పాఠశాలల సందర్శనలు, ఫీల్డ్ విజిట్స్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.